

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

14 ఆగస్టు 2025 పేజీలు : 08 గురువారం




## రైతుల కోసం అంకితభావంతో
# పని చేయండి
### నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే సోమిరెడ్డి సూచన

నెల్లూరు, మేజర్‌న్యూస్ :

రైతుల కోసం అంకితభావంతో పని చేయాలని నూతన పాలక వర్గానికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. తోటపల్లి గూడూరు, పేడూరు పీఏసీఎస్ అధ్యక్షులుగా సన్నారెడ్డి సురేష్ రెడ్డి, గూడూరు నారాయణతోపాటు డైరెక్టర్లుగా దేవ రాల ప్రవీణ్, మేనాటి శీనయ్య, జానా శ్రీనివసులు, మూగా రాజా నియమితులైన నూతన పాలకవర్గాన్ని ఎమ్మెల్యే సోమిరెడ్డి అభినం దించారు. అల్లీపురంలోని సోమిరెడ్డి నివాసంలో చైర్మన్లు, డైరెక్టర్లు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం -మిగతా 2లో

- పార్టీ కార్యకర్తలందరూ ఆ దిశగా కృషి చేయాలి
- ప్రతి పౌరుడు జాతీయ జెండాను ఎగురవేసే విధంగా కార్యకర్తలు కృషి చేయాలి
- దేశంలోనే నెల్లూరుకు ఓ ప్రత్యేక స్థానం ఉంది
- వచ్చే ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలు పోటీ చేసి గెలవాలి
- ప్రజా సమస్యలపై నేతలు పరిష్కరించేందుకు ముందుండాలి
- అన్ని గ్రామాలలో బీజేపీ జెండా ఎగరాలి
- కూటమి ప్రభుత్వంలో బీజేపీకి గౌరవం తగ్గుతుందంటున్న బీజేపీ శ్రేణులు
- అనేక సంక్షేమ పథకాలతో మీ ఇంటికి వస్తున్న ప్రధాని మోడీ
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పిలుపు



## ఏపీలో బీజేపీని
# బలమైన శక్తిగా తయారుచేద్దాం

నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :

ఆగస్టు 15ను పురస్కరించుకొని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగిరేవిధంగా ప్రతి కార్యకర్త తమ ఇంటిపై జెండాను ఎగర వేయాలన్నదే బీజేపీ ఉద్దేశమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ కార్యకర్తలకు పిలు పునిచ్చారు. బీజేపీ సారథ్య కార్యక్రమంలో పాల్గొ నేందుకు మొట్టమొదటి సారిగా బీజేపీ సారథ్య బాధ్యతలు చేపట్టి నెల్లూరు విచ్చేస్తున్న సంద ర్భంగా కార్యకర్తలు నేతలు ఆయనకు అడుగ డుగున ఘన స్వాగతం పలికారు. బుధవారం ఉదయం వేదాయపాళెంలో 'చాయ్ చాట్ చర్చ' కార్యక్రమంలో పాల్గొని ప్రజలతో ముఖా ముఖి కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆత్మకూ రు బస్టాండ్ వద్ద పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వీఆర్సీ గ్రౌండ్‌కు -మిగతా 2లో

## పులివెందులలో ప్రజాస్వామ్యం బతకడాన్ని
# ఓర్చుకోలేకపోతున్న జగన్ రెడ్డి

- ఒళ్లు బలిసే చంద్రబాబుపై నోటికొచ్చినట్టు వ్యాఖ్యలు
- నోరు అదుపులో పెట్టుకోకపోతే జగన్ రెడ్డి అండ్ బ్యాచ్ ఫలితం అనుభవించక తప్పదు
- మీడియాతో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

06



# గ్రామ సేవకుల ఆకలి కేకలు!



- మూడు నెలలుగా అందని వేతనాలు
- బిల్లులు పెట్టడంలో అధికారుల నిర్లక్ష్యం
- జీతాల కోసం నిరసనలు చేసే పరిస్థితి
- పట్టించుకోని ఉన్నతాధికారులు

లోపల పేజీలో


నేటి దినపత్రిక సూర్య వార్షికోత్సవ శుభాకాంక్షలు



దేవాదాయ ధర్మాదాయశాఖ
శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానము
రంగనాయకులపేట, నెల్లూరు నగరము, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

నూతనముగా శ్రీ స్వామి వారి దేవస్థానము నందు నిత్య అన్నదానము పథకము ప్రారంభించుచున్నాము. నిత్య అన్నదానమునకు రూ. 5,116/-లు పైబడి విరాళములు ఇచ్చిన దాత పేరును వారు కోరిన దినమున అన్నదానము జరుపబడును.

తేది : 15-08-2025న ఉదయం 10.00 గం॥లకు సామూహిక వరలక్ష్మీవ్రతం మరియు
తేది : 22-08-2025న ఉదయం 10.00 గం॥లకు సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించబడును.
కావున భక్తులెల్లరూ పాల్గొనవలసినదిగా కోరుచున్నాము.

గమనిక : పై రెండు పూజా కార్యక్రమములో పాల్గొను భక్తులకు దేవస్థానము వారిచే ఉచితముగా పూజా సామగ్రి ఇవ్వబడును.

ఆళ్ళ శ్రీనివాసరెడ్డి
కార్యనిర్వహణాధికారి

- మూడు నెలలుగా అందని వేతనాలు
- బిల్లులు పెట్టడంలో అధికారుల నిర్లక్ష్యం
- జీతాల కోసం నిరసనలు చేసే పరిస్థితి
- పట్టించుకోని ఉన్నతాధికారులు

# గ్రామ సేవకుల ఆకలి కేకలు !




**అసలే చాలీచాలని జీతాలు.. ఆపై నిత్యం విధులపై గ్రామాల్లో ఉండాల్సిన పరిస్థితి. వచ్చే జీతంతోనే కుటుంబ పోషణ జరగాల్సి ఉండగా, మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో వారి ఆకల కేకలకు అంతులేకుండా పోతోంది. దీంతోపాటుగా తహసిల్దార్ కార్యాలయంలో పని చేసే అధికారులను అడిగితే.. కక్ష సాధింపు చర్యలు తీసుకుంటారేమోనని వెనకంజ వేయక తప్పడం లేదు. ఈ పరిస్థితిని జిల్లాలోని మర్రిపాడు మండలంలో పని చేసే గ్రామ సేవకులు అనుభవిస్తున్నారు. *వివరాల్లోకి వెళితే..***

*మర్రిపాడు, మేజర్‌న్యూస్ :*

జిల్లాలోని మర్రిపాడు మండలంలో 24 పంచాయతీలకు గాను 47 మంది గ్రామ సేవకులు పనిచేస్తున్నారు. అందులో 10 గ్రామాలకు సంబంధించిన గ్రామ సేవకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ తరుణంలో 37 మంది విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఈ గ్రామ సేవకులు గ్రామాల్లోనే ఉండి విధులు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహిస్తూ ఉంటారు. ప్రతి చిన్న విషయం గ్రామాల్లో జరిగినప్పటికీ తాసిల్దార్ కార్యాలయానికి సమాచారం అందిస్తూ ఉంటారు. దీంతోపాటుగా వీఆర్వోలు చెప్పినటువంటి పనులు, తాసిల్దార్ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది పనులు కూడా చేయాల్సిన పరిస్థితి. గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగిన వెంటనే వెళ్లి సమస్యను తెలుసుకుని కార్యాలయానికి సమాచారాన్ని అందించాల్సి ఉంది. అలాంటి తరుణంలో నెలవారి వచ్చే వేతనాలు కూడా అతి తక్కువ. ప్రస్తుత కాలంలో కుటుంబ పోషణ ఆ వేతనాలతో జరగకపోగా నెలకు అప్పులు చేసి జీవనాన్ని సాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామ సేవకులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో మూడు నెలలుగా జీతాలు అందక ఆకలి కేకలతో అలమటించక తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాసిల్దారు కార్యాలయంలో పనిచేసే అధికారులు బిల్లులు పెట్టడంలో నిర్లక్ష్యం వలన ఈ పరిస్థితి ఏర్పడిందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు రానందున ఒకవేళ ఆ అధికారులను అడిగిన తరుణంలో కక్ష సాధింపు చర్యలు ఉంటాయేమోనని భయపడుతూ ఎవరికీ చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. వేతనాలు అందలేదని రెండు రోజుల క్రితం తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని కూడా చేశారు. ఈ తరుణంలో అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో వారి ఆవేదనకు అంతులేకుండా పోతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు గమనించి వేతనాలను నెలవారీగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాల్సిందిగా గ్రామ సేవకులు కోరుతున్నారు.

# ఏపీలో బీజేపీని బలమైన శక్తిగా తయారు చేద్దాం

*(మొదటి పేజీ తరువాయి)*

చేరుకున్నారు. అక్కడ నుంచి కార్యకర్తలు, నేతలు, అభిమానులతో భారీ ర్యాలీగా బయలుదేరి కస్తూరిదేవి కళాక్షేత్రానికి చేరుకున్నారు. మార్గమధ్యంలో జిల్లా శాఖ క్రేన్ తో ఏర్పాటు చేసిన గజమాలతో మాధవ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సారథ్యలో సభలో ముందుగా జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి అధ్యక్షతన మాధవ్ మాట్లాడుతూ.. రాబోయే రోజులలో ఏపిలో బీజేపీని బలమైన శక్తిగా తయారు చేద్దామని అందుకు అందరూ తమవంతుగా కృషి చేయాలన్నారు. తనకు నెల్లూరుతో ప్రత్యేక అనుబంధం ఉందని, ఆనాటి తన తండ్రి హయాం నుంచి ప్రతి సీనియర్ కార్యకర్తతో పరిచయాలు ఉన్నాయన్నారు. దేశంలోనే నెల్లూరు ప్రత్యేక స్థానం వుందన్నారు. ఎందలో మహానుబావులు ఈ నేలమీద పుట్టు నెల్లూరు ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చారని, అందులో ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మాజీ ముఖ్యమంత్రులు నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి, బెజవాడ గోపాల్ రెడ్డి, వామ పక్షనేత పుచ్చలపల్లి సుందరయ్య లాంటి నేతలు చేసిన సేవలను ఆయన కొనియాడారు. వచ్చే ఏ ఎన్నికలలోనైన బీజేపీ కార్యకర్తలు పోటీ చేసి గెలవాలని అప్పుడే మన బలం పెరుగుతుందన్నారు. ప్రజా సమస్యలపై పరిష్కరించేందుకు బీజేపీ నేతలు ముందుండాలని ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే లాగా జిల్లా, మండల కేంద్రాలలో బీజేపీ కార్యకర్తలు ప్రజల సమస్యలపై అర్జీలను స్వీకరించి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని, అప్పుడే ప్రజలు బీజేపీని బలంగా గుర్తిస్తారన్నారు. ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఎగరవేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. కూటమి ప్రభుత్వంలో బీజేపీ నేతలకు, కార్యకర్తలకు తగ్గిన గౌరవం లభించడం లేదని రాష్ట్ర వ్యాప్తంగా అనేక విషయాలు తన దృష్టికి వచ్చాయని కూటమి ప్రభుత్వ నేతల దృష్టికి



తీసుకెళ్ళి సమస్యను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రతి కార్యకర్త ప్రజా నాయకుడుగా ఎదగాలన్నారు., ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా కార్యాలయంలో అర్జీలను స్వీకరించే కార్యక్రమాన్ని నెల్లూరు నుంచే ప్రారంభించాలని రాష్ట్రంలో ప్రతి కార్యకర్త నెల్లూరు బీజేపీ కార్యకర్తలను ఆదర్శంగా తీసుకొనే విధంగా ప్రయత్నాలు ప్రారంభించాలని జిల్లా అధ్యక్షులకు సూచించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మీ ఇంటికి వచ్చారనే నినాదంతో కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజలకు నరేంద్ర మోడీ ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. ప్రధానమంత్రి మాతృవందనతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందంటూ కొన్ని సంక్షేమ పథకాలను పేర్లను ఆయన తెలిపారు. సురక్షయోజన, ఉచిత బియ్యం, సీసీ రోడ్లు, పాఠశాల అభివృద్ధి, అయుష్మాన్ వైద్యశాలలు, రైతుభరోసా, స్వచ్ఛ సంపద, అంగన్ వాడీ కేంద్రాలు లాంటి అనేక సంక్షేమ పథకాలకు ప్రధానమంత్రి నేరుగా గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయిస్తున్నారన్నారు. ప్రతి గ్రామానికి 10 సంవత్సరాలలో ఒక్కొ పంచాయతీకి 2 కోట్లు రూపాయల చొప్పున నిదులు విడుదల చేశారని ఆయన తెలిపారు. అంతకు ముందు వాకాటి నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పాలనలో ప్రజా సమస్యలపై పోరాడితే బీజేపీ కార్యకర్తలపై పెట్టిన కేసులకు కోర్టు చుట్టూ కార్యకర్తలు తిరుగుతున్నారని, కూటమి ప్రభుత్వం బీజేపీ కార్యకర్తలు పడుతున్న కష్టాలను పట్టించుకోవడం లేదని, రాష్ట్ర అధ్యక్షులుగా మీరు చొరవ తీసుకొని ప్రభుత్వంతో చర్చించి బాధపడుతున్న కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి మాట్లాడుతూ.. మాధవ్ తండ్రి పివి చలపతిరావుతో మాకు ఎంతో అనుబంధం ఉందని, ఆనాటి సంఘటనను ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి బిజేపీ నేతలను, కార్యకర్తలను టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు చేపట్టే కార్యక్రమాలలో బీజేపీకి ప్రాధాన్యత ఇవ్వడం లేదని కార్యకర్తలు ఆవేదన చెందుతున్న విషయాన్ని మాధవ్ దృష్టికి తీసుకువచ్చారు. సీఎం, మంత్రి లోకేష్‌లు మంత్రులకు, ఎమ్మెల్యేలకు చెబుతునప్పటికి వారు పట్టించుకోవడం లేదని తెలిపారు. బీజేపీ పంతం అవినీతి అంతం అనే నినాదాన్ని ఆనాడే చేపట్టామని, కొంత మంది అవినీతికి అడ్డాగా మారుతున్నారని ప్రతి కార్యకర్త అవినీతిని ఎదుర్కొనేందుకు ముందుంటారని తెలిపారు. కార్యక్రమంలో సన్నరెడ్డి దయాకర్ రెడ్డి, సురేంద్రరెడ్డి, కాకు విజయలక్ష్మి, అంజనేయ రెడ్డి, భరత్‌కుమార్ యాదవ్, కే.రాజేశ్వరి, కమలా, ఆర్డీ విల్సాన్, అంకయ్య నాయుడు, రఘునాథరాజు, సుమంత్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతుల కోసం అంకితభావంతో పని చేయండి

*(మొదటి పేజీ తరువాయి)*

అందజేసి శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో ఉంటూ.. వారి కోసం పని చేయాలని సూచించారు. అనంతరం చైర్మన్లు, డైరెక్టర్లు మాట్లాడుతూ.. తమకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, జాఫర్ సాహెబ్ కాలువ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మండల అధ్యక్షుడు కొణతం రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ హాస్పిటల్స్‌కు అనుమతి తప్పనిసరి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలో ఉన్న ప్రతి ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యం తప్పనిసరిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుండి అనుమతి పొందాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి సూచించారు. బుధవారం నగరంలోని విజయానంద్ ఆర్థోపెడిక్ హాస్పిటల్, సుమ స్కిన్ అండ్ లేజర్ క్లినిక్, లక్ష్మి ఆర్తో కేర్ సెంటర్, ఆకర్ష్ హాస్పిటల్ తోపాటు పలు ఆసుపత్రులలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, ఆసుపత్రుల అనుమతి పత్రాలను పరిశీలించారు. ఆసుపత్రులలో అందిస్తున్న సేవలు వాటికి సంబంధించిన ధరలు పట్టికను ప్రదర్శించాలని సూచించారు. అవుట్ పేషెంట్లు రిజిస్టర్లను పరిశీలించారు. ఆస్పత్రుల అనుమతులు తప్పనిసరిగా ఉండాలని, అనుమతులు లేని ఆసుపత్రులలో వైద్యం చేయటం నేరమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ అశోక్ పాల్గొన్నారు.

# గాంధీనగర్ ఆప్కో స్థలాన్ని చేనేతలకు కేటాయించాలి

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌కు

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ నెల్లూరు జిల్లా చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా ప్రతినిధులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బుధవారం బాలాజీ మాట్లాడుతూ.. నెల్లూరు నగరంలో గాంధీ నగర్‌లో గల 6.90 సెంట్లు ఆప్కో స్థలాన్ని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆప్కోకి కేటాయించిన స్థలాన్ని గత ప్రభుత్వం వరకు ఖాళీగా ఉన్నది. దానిని గత ప్రభుత్వంలో ఏపీ సీడ్స్ సంస్థకు ఒక ఎకరా భూమి ప్రభుత్వం కేటాయించింది. మిగతా భూమి అలాగే 2022 వరకు ఉన్నది. గత ప్రభుత్వంలో నూడా కార్యాలను కొంత భూమి, జిల్లా వ్యవసాయ కార్యాలయాన్ని కొంత భూమి కేటాయించినారు. మిగతా భూమి మొత్తం అలాగే ఖాళీగా ఉన్నది. దానిని జిల్లాలో ఉండే చేనేత వృత్తి చేసుకునే కార్మికులకు కేటాయించి నేత బజార్ ఏర్పాటు చేయాలని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఆ విధంగా నేత బజారు ఏర్పాటు చేస్తే జిల్లాలో ఉండే చేనేత కార్మికులు 3600 మగ్గాలు మీద వస్త్రాలు తయారు చేస్తూ.. 5వేల మంది ఉపవృత్తులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆ స్థలాన్ని నేతబజారకు కేటాయించిన యెడల వీరు తయారు చేసిన వస్త్రాలను అక్కడ విక్రయించుకునే విధంగా వసతి కల్పిస్తే వారికి గిట్టుబాటు ధర లభిస్తుంది. గిట్టుబాటు ధర కలిగినచో మరి కొంతమంది ఈ వృత్తిలోకి వచ్చే అవకాశం ఉన్నది. ఎప్పుడైతే మార్కెట్ సదుపాయం




కలిగినచో వారి జీవితాలలో మేలు జరుగును. అప్పుడు చేనేత కార్మికులు అధిక వడ్డీలు జోలికి పోకుండా అప్పుల పాలు కాకుండా అవమానాలు ఎదుర్కొనకుండా ఆత్మహత్యలు చేసుకోకుండా మెరుగైన జీవితాన్ని గడుపుతారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యైన మీరు మాకు ప్రభుత్వంతో మాట్లాడి ఆ స్థలాన్ని కేటాయించి అచ్చట నేత బజారు సౌకర్యాన్ని కల్పించవలసిందిగా ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘ కేంద్ర కమిటీ సభ్యులు రామనాథం రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు జానపాటి రామసుబ్బయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సోమాగోపాల్, మహిళా అధ్యక్షురాలు సోమ అనురాధ, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# ఉదయగిరి జిల్లా చేయాలని మంత్రికి వినతి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** నెల్లూరు ప్రకాశం కడప జిల్లాలలోని అత్యంత వెనుకబడిన మెట్ట మండలాలను కలిపి ఉదయగిరి జిల్లా ఏర్పాటు చేయాలని మంత్రుల ఉపసంఘాన్ని కోరినట్లు ఉదయ గిరి జిల్లా సాధన కమిటీ తెలిపింది. బుధవారం వెలగపూడి సచివాలయంలో జరిగిన జిల్లాల మండలాల పునర్వ్యవస్థీకరణ మంత్రుల ఉపసంఘం సమావేశంలో ఉదయగిరి జిల్లా సాధన కమిటీ నాయకులు పాల్గొని తమ వాదన వినిపించారు. రాష్ట్రంలోనే ఉదయగిరి నియోజకవర్గం అత్యంత వెనకబడి వుందని, ఈ ప్రాంతం ఇతర ప్రాంతాలతో సమానంగా అభివృద్ధి చెందాలంటే జిల్లా చేయడం ఒక్కటే మార్గమన్నారు. తద్వారా సత్వర అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. వెయ్యేళ్ల మహోన్నత చరిత్రగల ఉదయగిరి ప్రాంతం స్వాతంత్ర్యం వచ్చిన నాటినుండి ప్రభుత్వ నిరాదరణకు గురైందని పేర్కొన్నారు. వ్యవసాయపరంగా పారిశ్రామికంగా ఎంతో వెనకబాటుకు గురైవున్న ఉదయగిరిని జిల్లాగా చేసి ప్రగతిపథం వైపుకు నడిపించాలని వారు మంత్రివర్గ ఉపసంఘాన్ని కోరారు. స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఉదయగిరి డివిజన్ మంజూరుకు కృషిచేస్తున్నారని వారికి తమ కమిటీ ధన్యవాదాలు తెలుపుతోందని వారు మంత్రి వర్గ ఉపసంఘం దృష్టికి తెచ్చారు. డివిజన్ ఏర్పాటుతో ఈ ప్రాంత సత్వర అభివృద్ధి సాధ్యపడదన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ఉదయగిరి జిల్లా చేసే విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిశీలిస్తామని మంత్రులు పి నారాయణ, సత్యకుమార్ తెలిపారని చెప్పారు. మంత్రివర్గ ఉపసంఘాన్ని కలిసినవారిలో ఉదయగిరి జిల్లా సాధన కమిటీ నాయకులు షేక్ దస్తగిరి అహమద్, జి.రామిరెడ్డి, రబ్బానీ ఉన్నారు.

## సారథ్యం యాత్రకు తరలిన బిజేపీ నేతలు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన 'సారథ్యం' యాత్రను ఘన విజయం చేయడానికి జిల్లా అధ్యక్షులు సీపారెడ్డి, వంశీధర్ రెడ్డి ఆదేశాలతో నెహ్రూ యువకేంద్రం జిల్లా అడ్వైసరి కమిటీ మెంబెర్ నూనె హజరత్ యాదవ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి తలచిరు తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో మర్రిపాడు మండలం నందవరం, రామా నాయుడుపల్లి నుండి భారీగా తరలి వెళ్లారు. ఈ యాత్రకు రెండు పంచాయతీల నుండి స్వచ్ఛందంగా ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి వెళ్లారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తనిఖీ : ఎంఈఓ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారి టి.వెంకటేశ్వర్లు బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉదయగిరి బీసీ కాలనీ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఫార్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలను పరిశీలించిన తదుపరి పాఠశాలలోని డ్రాప్ అవుట్స్, లాంగ్ ఆబ్సెంటీస్ విద్యార్థులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఒక రిజిస్టర్ ఏర్పాటు చేసుకుని వారందరూ పాఠశాలలో చేరే విధంగా ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకొని వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి వారు పాఠశాలకు వచ్చే విధంగా చూడాలని తెలియజేశారు. అదేవిధంగా మిగిలిన విద్యార్థుల అపార్ ఐడి, ఎస్ఆర్‌కేవీఎం కిట్స్ బయోమెట్రిక్ ఆథెంటిఫికేషన్ త్వరితగతిన నూటికి నూరు శాతం పూర్తయ్యే విధంగా చూడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు షేక్ నూర్జహాన్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రైతు రథాలతో అన్నదాత సుఖీభవ భారీ ర్యాలీ

**దుత్తలూరు/వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు, అన్నదాత సుఖీభవ ద్వారా రైతన్నలకు అండగా నిలిచిన, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంఘీభావంగా ఉదయగిరి నియోజకవర్గంలోని రైతన్నలు తమ రైతు రథాల ద్వారా భారీ ర్యాలీ నిర్వహించారు. బుధవారం నియోజకవర్గంలోని దుత్తలూరు మండల కేంద్రం తహసిల్దార్ కార్యాలయం నుండి ఉదయగిరిలోని ఏఎంసి మార్కెట్ యాడ్ వరకు రైతన్నలు టాక్టర్లతో వర్షాన్ని సైతం లెక్కచేయక భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామి రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ పొన్ను బోయిన చంచల బాబు యాదవ్, మాజీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరి చిరంజీవి రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ర్యాలీ అనంతరం అతిథులు మాట్లాడుతూ.. అన్నదాత సుఖీభవ ద్వారా 46.5 లక్షల రైతన్నలకు, రూ 2325 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. మన జిల్లాలో అన్నదాత సుఖీభవ మొదటి విడతలో మొత్తం 1,95,866 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున మొత్తం 97.933 కోట్లు రూపాయలు ఆర్థిక సహాయం లభించనుందని తెలిపారు. అదే విధంగా పి యం కిసాన్ 20వ విడత కింద జిల్లా వ్యాప్తంగా 1,68,350 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున 33.67 కోట్ల రూపాయలు ఆర్థిక సహాయంలభించనుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లాలోని దర్శి నియోజకవర్గం పరిధిలోని ఈస్ట్ వీరయ్యపాలెం గ్రామంలో ఈనెల 1వ తేదీన ప్రారంభించారన్నారు.అలాగే జాతీయ స్థాయిలో ప్రధాని నరేంద్ర మోదీ వారణాసిలో ప్రారంభించారని తెలిపారు. దీనిద్వారా సాగుదారుల కుటుంబాలు అనగా స్వంతంగా సాగు భూమిని కలిగిన రైతు కుటుంబాలు, ఆర్ఓఎఫ్ఆర్ భూములు సాగుచేసే కుటుంబాలకు రూ.20వేలు వార్షికంగా ప్రయోజనం లభించింది అన్నారు.ఇందులో రూ.6,000/- కేంద్ర ప్రభుత్వం నుండి పీఎం కిసాన్ పథకం ద్వారా, రూ.14వేలు రాష్ట్ర ప్రభుత్వం నుండి అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లభిస్తుందని తెలిపారు. ఈ విడతలో ప్రతి రైతుకు ఏడిఎస్‌బి కింద 5వేలు, పీఎం కిసాన్ కింద 2వేలు కలిపి మొత్తం 7వేల ఆర్థిక సహాయం లభిస్తుందని తెలిపారు. ఒకవేళ ఈ విడతలో అర్హత కల్గిన రైతులు ఆర్థిక సహాయం పొందనట్లయితే మీ సమీపంలో ఉన్న రైతు సేవకేంద్రంను సంప్రదించి అవసరం అయిన పత్రాలు సమర్పిస్తే మలివిడతలో మొత్తం పొందవచ్చునని వివరించారు. అలాగే 2025-26 సంవత్సరానికి సంబంధించిన ఉదయగిరి నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ సుమారు 44వేల మందికి 30.42 కోట్లు లబ్ధి చేకూరింది అన్నారు.మండలాల వారీగా, ఉదయగిరి 4693 మందికి దుత్తలూరు 4396, వరికుంటపాడు 5387, సీతారాంపురం, 2881 వింజమూరు 4705 కలిగిరి 7756 కొండాపురం7029 జలదంకి 6622 మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తుంది అన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ఎంతోమంది తల్లులకు లబ్ధి చేకూరిందన్నారు.అమ్మ ఒడికి, తల్లికి వందనం పథకానికి పోలిక లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమంది పిల్లలకు తల్లికి వందనం ద్వారా 13వేల రూపాయలు జమ చేయడం జరిగిందన్నారు. వైసిపి ప్రభుత్వం అంకెల గారి తప్ప చేసింది ఏమీ లేదు అన్నారు. ఆగస్టు 15 నుండి స్త్రీశక్తి పేరుతో బస్సులో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించబడుతుందన్నారు. ఏడాది కాలంలో సుపరిపాలనలో రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా



చంద్రబాబు నాయుడు ఇరిగేషన్ ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, రాయలసీమను రతనాల సీమను చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య మండల కన్వీనర్లు వెంకటరత్నం, గూడా నరసారెడ్డి, సిహెచ్ బయన్న, కప్ప ప్రభాకర్ రాజు, చంద్ర మధుసూదన్ రావు, బిజ్జం వెంకటకృష్ణారెడ్డి, మధు మోహన్ రెడ్డి, రైతు అధ్యక్షులు, బొల్లినేని వెంకట రామారావు, సీనియర్ నాయకులు సుదర్శన్ రెడ్డి, ఉండేలా గురవారెడ్డి, మంచాల శ్రీనివాసులు నాయుడు, సొసైటీ అధ్యక్షులు చల్లా వెంకటేశ్వర్లు కదిరి రంగారావు, యాదవ్, ఎస్టీ సెల్ అధ్యక్షురాలు ఆవుల అరుణమ్మ, మల్లంపాటి గురవయ్య నాయుడు, అన్నపురెడ్డి వెంగళరెడ్డి, మాజీ ఎంపీపీ రవీంద్రబాబు మాజీ జడ్పిటిసి సభ్యులు చీదర్ల మల్లికార్జున, రావులకొల్లు సర్పంచ్ పీవీ నాయుడు, పోలు బోయిన చంద్రబాబు నాయుడు, పాములపాటి మల్లాద్రి, బొజ్జ నరసింహులు, రామలక్ష్మణులు, కోడూరు నాగిరెడ్డి, భాషిం నరసింహానాయుడు, కూటమి నాయకులు రైతులు, కార్యకర్తలు అభిమానులు తదితరులున్నారు.

# వ్యాపారులంతా ట్రేడ్ లైసెన్సు తీసుకోవాలని : టీపీఆర్‌ఓ



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని వ్యాపారాలకు ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరి అని, సచివాలయాల వారిగా సంబంధిత శానిటేషన్ కార్యదర్శులు నూతన వ్యాపారాలను గుర్తించి వ్యాపారస్తులంతా ట్రేడ్ లైసెన్సులు తీసుకునేలా, క్రమం తప్పకుండా లైసెన్సులను రెన్యువల్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ టిపిఆర్ఓ వాసుబాబు ఆదేశించారు. పబ్లిక్ హెల్త్ విభాగం, వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో వారాంతపు సమీక్ష సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ ప్రక్రియను క్రమం తప్పకుండా చేపడుతూ, 24 గంటల లోపునే గార్బేజిల నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించేసేలా సిబ్బందిని పర్యవేక్షించాలని శానిటేషన్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. 24 గంటల్లో గార్బేజిల నుంచి చెత్తను సేకరించే విధంగా ప్రణాళికలు రూపొందించుకుని, ఇంటింటి చెత్త సేకరణలో తప్పనిసరిగా తడి, పొడి చెత్తను విడిగా సేకరించేలా పారిశుద్ధ్య సిబ్బందిని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. అన్ని డివిజన్లలో క్రమం తప్పకుండా డ్రైన్ కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను చేపట్టాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రతి 14 రోజులకు ఒకసారి ఫాగింగ్ ప్రక్రియను అమలు చేస్తూ, ఆయిల్ బాల్స్ పిచికారి, గంబుజియా చేప పిల్లల పెంపకం తదితర కార్యక్రమాలతో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో వాతావరణంలో చోటు చేసుకునే మార్పుల ఫలితంగా సీజనల్ వ్యాధులతో పాటు విష జ్వరాలు ప్రబలే అవకాశం అధికంగా ఉంటుందని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు కాచి వడగాచిన నీటిని తీసుకోవాలనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో నెల్లూరు నగరపాలక ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి, వెటర్నరీ వైద్యులు డాక్టర్ మదన్మోహన్, మలేరియా విభాగం అధికారి డాక్టర్ జిజియాబాయి, శానిటేషన్ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వాతంత్య్ర దినోత్సవానికి ముస్తాబైన కార్యాలయం



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన మర్రిపాడు తాసిల్దార్ కార్యాలయం స్వాతంత్య్ర దినోత్సవానికి విద్యుత్ అలంకరణతో ముస్తాబయింది. ఈ సందర్భంగా ఇంచార్జ్ తహసిల్దార్ అనిల్ కుమార్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనేపథ్యంలో రంగు కాగితాలతోపాటుగా జాతీయ జెండాను ఎగుర వేసేందుకు తగు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కార్యాలయంలో శుక్రవారం జరిగేటువంటి స్వాతంత్య్ర దినోత్సవానికి ప్రతి ఒక్క అధికారి హాజరుకావాలని తెలియజేశారు. దేశభక్తిని ప్రతి ఒక్క పౌరుడు అలవర్చుకోవాలని సూచించారు. దీంతో పాటుగా స్వాతంత్య్రం తెచ్చినటువంటి అమరవీరులను గుర్తు చేసుకునేందుకు ఇదొక సువర్ణ అవకాశం అని తెలిపారు. అందువలన కార్యాలయ సిబ్బందితోపాటు మండల ప్రజలు కూడా ఈ వేడుకల్లో పాల్గొనాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

# ఎస్‌వీ డిగ్రీకాలేజిలో విద్యార్థులకు అవగాహనాసదస్సు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని ఎస్.వి.డిగ్రీకాలేజిలో బుధవారం స్థానిక సిఐ జి.గంగాధర్ పలు అంశాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. మాదకద్రవ్యాలు, మొబైల్‌ఫోన్ వినియోగం, ర్యాగింగ్ అంశాల గురించి ఆయన వివరించారు. జిల్లా ఎస్‌పి ఆదేశాలు, స్థానిక డిఎస్‌పి సూచనలమేరకు ఈ సదస్సు నిర్వహించారు. మొబైల్ ఫోన్‌లను అవసరంమేరకే వాడుకోవాలని, అభ్యంతరకర, అసభ్యకర, అశ్లీల అంశాల జోలికెళ్ళరాదని ఆయన సూచించారు. వాహనాలు నడిపే సమయంలో మొబైల్‌ఫోన్‌లను వాడరాదని ఆయన సూచించారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే అనేక అనర్థాలకు దారితీస్తాయని, ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతాయని ఆయన పేర్కొన్నారు. ర్యాగింగ్ అనేది అత్యంత ఇబ్బందికర పరిణామాలకు దారితీస్తుందన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడరాదని గంగాధర్ సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడరాదని ఆయన సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే ర్యాగింగ్‌నిరోధక చట్టం ద్వారా కఠిన చర్యలుంటాయన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడినా చట్టపరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. మొబైల్‌ఫోన్లు జాగ్రత్తగా వాడుకోవాలని, వాహనాలను నడిపేసమయంలో వినియోగించి ప్రమాదాలు తెచ్చుకోరాదని ఆయన సూచించారు. ఈ అంశాలపట్ల విద్యార్థులు తగు అవగాహనతో వ్యవహరించాలని, అలాంటి అలవాట్లకు లోనుకాకుండా శ్రద్దాసక్తులతో చదువుకుని ఉజ్వల భవిష్యత్తు పొందాలని సిఐ గంగాధర్ సూచించారు. ఈకార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరణ



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌గా చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు కోడూరు నాగిరెడ్డి గని శ్రీనివాసులు నాయుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు చల్ల వెంకటేశ్వర్లును శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. తమ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆశీస్సులతో సొసైటీ చైర్మన్ పద వివరించిందని ఎమ్మెల్యే సూచనలు మేరకు త్వరలోనే ప్రమాణస్వీకారం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో మేకల రమణయ్య, నాయకులు చల్ల శ్రీనివాసులు యాదవ్, దిద్దిగుంట శ్రీనివాసరెడ్డి, సొసైటీ సిబ్బంది శ్రీనివాసులు రెడ్డి తదితరులు ఉన్నారు.

# అడుగడుగునా.. పీవీఎన్ మాధవ్‌కు నీరాజనం



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్

బీజేపీ సారథ్య కార్యక్రమంలో పాల్గొనేందుకు మొట్టమొదటి సారిగా బీజేపీ సారథ్య బాధ్యతలు చేపట్టి నెల్లూరు విచ్చేస్తున్న సందర్భంగా కార్యకర్తలు నేతలు ఆయనకు అడుగడుగున ఘనంగా స్వాగతం పలికారు. బుధవారం ఉదయం వేదాయపాలెంలో చాయ్ చాట్ చర్చ కార్యక్రమంలో పాల్గొని ప్రజలతో ముఖా ముఖి కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆత్మకూరు బస్టాండ్ వద్ద గల పొట్టి శ్రీ రాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళులు అర్పించారు.

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :**



నెల్లూరులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ వేదయపాలెంలో చాయ్‌పై కార్యక్రమంలో స్థానికులతో చిట్‌చాట్ నిర్వహించారు. కొన్ని అంశాలపై రాష్ట్ర నాయకులు మాట్లాడారు.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ తండ్రి పీవీ చలపతిరావు సహచరుడు ఉమ్మడి నెల్లూరు జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షులు రంగినేని కృష్ణయ్య రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం



నెల్లూరులో రాష్ట్ర నూతన కమల దళపతి మాధవ్‌కు వికసించిన కమలం పుష్పాన్ని ఇచ్చి శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ నేత మిడతల రమేష్ తదితరులు



బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ నెల్లూరుకు విచ్చేసిన సందర్భంగా వీఆర్సీ వద్ద ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కాకు విజయలక్ష్మి తదితరులు

## డీసీసీబీ చైర్మన్‌ను కలిసిన మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా సహకార సంఘం సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయ రెడ్డిని నెల్లూరులో నివాసంలో బుధవారం అనంతసాగరం మండలం ఎస్సీ సెల్ అధ్యక్షులు బొర్రా బాబు కలిశారు. ఈ సందర్భంగా ఈ నెలలో మండల కేంద్రమైన అనంతసాగరంలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ గురించి బొర్రా బాబు చైర్మన్ మెట్టుకూరు ధనుంజయ రెడ్డితో చర్చించారు. అనంతరం చైర్మన్ ధనుంజయ రెడ్డిని బొర్రా బాబు ఘనంగా సన్మానించారు.

## పాఠశాలలు తనిఖీ : ఎంఈఓ 2

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** మండలం సోమశిల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలను బుధవారం ఎంఈఓ-2 కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల వర్క్ బుక్ లను పరిశీలించారు. అనంతరం బడి మానేసిన ఒక విద్యార్థిని ఎంఈఓ 2 కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డి చేర్పించి సోమశిల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజుకు అప్పచెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# నక్ష సర్వే కార్యక్రమంపై అవగాహన కల్పించండి : కమిషనర్



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** భారత ప్రభుత్వం, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలోని భూముల వనరుల విభాగం ద్వారా, నగర ప్రాంతాలలో భూముల సర్వేను ఆధునికంగా, సాంకేతికంగా డిజిటల్ విధానంలో నిర్వహించడానికి నక్ష పేరుతో ఒక వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ప్రజల స్థిరాస్తులకు ఎంతో ప్రయోజనం చేకూర్చే నక్ష సర్వే నిర్వహణ గురించి ప్రజలందరికీ అవగాహన కల్పించాలని కమిషనర్ వై.ఓ నందన్ కోరారు. నక్ష సర్వే నిర్వహణపై సమీక్షా సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో బుధవారం నిర్వహించారు. కమిషనర్ పాల్గొని నెల్లూరు నగరపాల సంస్థకు సంబంధించిన ఓఆర్ఐ నమూనాను నక్ష బృందానికి అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సర్వే ఆఫ్ ఇండియా విభాగం నుంచి నక్ష సర్వే నిర్వహించేందుకు అవసరమైన నెల్లూరు నగరపాలక సంస్థ ఓఆర్ఐ నమూనాను రూపొందించి అందజేశారని తెలిపారు. నక్ష సర్వే నిర్వహణ ద్వారా పట్టణ ప్రణాళిక, అభివృద్ధి, మౌలిక సదుపాయాల నిర్ణయాలకు తోడ్పాటును అందించి పౌరుల ఆస్తి రికార్డులు, పన్నులలో పారదర్శకత, సమర్థతలను కలిగివుంటుందని వివరించారు. ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన నక్ష సర్వే నిర్వహణ గురించి ప్రజలందరికీ అవగాహన కల్పించి సర్వే బృందాలకు సహకరించేలా పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో నెల్లూరు నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం సిటీ ప్లానర్ హిమబిందు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సతీష్ బాబు, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని నగర డిప్యూటీ మేయర్ కార్యాలయంలో బుధవారం డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దార్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భారీ గజమాలతో సత్కరించి అనంతరం కేకును కట్ చేసి నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ మైనారిటీ నాయకులు హాజీ ఆధ్వర్యంలో నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ కి చిత్రపటాన్ని బహూకరించి సురేష్, కమల్, శీను, వారి మిత్ర బృందం జన్మ దిన శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు జమ్మళ్ల వినోద్ ఆధ్వర్యంలో నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ 50 అడుగుల భారీ కటౌట్ ఏర్పాటు చేసి వారి చిత్రపటానికి పాలాభిషేకం చేసి అనంతరం కేక్ కట్ చేయించి నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్‌కి జన్మదిన శుభాకాంక్షలు జమ్మల వినోద్, జమ్మల కార్తీక్, లోకేష్, విజయ్, వారి మిత్రబృందం తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకులు వడ్లమూడి చంద్ర, అల్లంపాటి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో నగర డిప్యూటీ మేయర్ కుమార్ యాదవ్‌ని మాలతో సత్కరించి అనంతరం వారి చేత కేక్ కట్ చేయించి వడ్లమూడి చంద్ర, అల్లంపాటి జనార్దన్ రెడ్డి, వారి మిత్ర బృందం జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు. గీతామయి వృద్ధుల ఆశ్రమంలో నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి హాజీ, అమ్ములా, కాకు హరికృష్ణ, దొంతాలి ప్రసాద్ తదితరులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు పోడమేకల సురేష్, యాదవ యూత్ ఆధ్వర్యంలో బాలాజీ నగర్‌లో ఉన్న బాజీతోట ఎంసిపిఎస్ స్కూలు విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి అనంతరం 150 మంది విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేసి నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్‌కి పొడమేకల సురేష్, పులి విజయ్ వారి మిత్ర బృందం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# బుక్కాపురం గ్రామానికి బస్సు సౌకర్యం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలం బుక్కాపురం పంచాయతీ కేంద్రమైన బుక్కాపురం గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కలిగిందని సర్పంచి సిహెచ్ రసూల్ ఉపసర్పంచ్ కాటన్ రమణారెడ్డి తెలుగుదేశం నేతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 10 సంవత్సరాలుగా గ్రామానికి బస్సు సౌకర్యం లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామంలో నుండి సుమారు రెండు కిలోమీటర్ల పైగా నడవలసిన పరిస్థితి ఏర్పడేది. ఈపరిస్థితుల్లో పాఠశాలలకు కళాశాలలకు వెళ్లే విద్యార్థులు గ్రామస్తులు పని మీద బయటకు వెళ్లాలంటే ఎంతో ఇబ్బందులకు గురికావాల్సి వచ్చేది ఎన్నో మార్లు అధికారులకు ప్రజాప్రతినిధులకు తెలియజేసిన పట్టించుకున్న దాఖలాలు లేవని కానీ ప్రస్తుత ఎమ్మెల్యే కాకర్లసురేష్ దృష్టికి తీసుకు వెళ్ళగానే వెంటనే ఆయన స్పందించి వారి సమస్యను ఆర్టీసీ అధికారులు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డితో సంప్రదించి సమస్యను వివరించి ఈ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించారని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం ఒకసారి సాయంత్రం ఒకసారి ఈ బస్సు సౌకర్యం గ్రామానికి ఉండటం చేత గ్రామస్తులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కో కన్వీనర్ పాములపాటి మాల్యాద్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బస్సు సౌకర్యం లేని మారుమూల ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించే విధంగా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించేందుకు సహకరించిన మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి మండల నాయకులు వనిపెట్ట వెంకటసుబ్బారెడ్డికి గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం శ్రీను టి.విజయ్ వి దొరస్వామి నాయుడు, యు.బాలకృష్ణ డి.మస్తాన్ బిజెపి నాయకులు లక్ష్మీనారాయణ గ్రామస్తులు తదితరులున్నారు.

# చిన్నారి గొంతులో ఇరుక్కున్న పిన్నీసు తొలగించి ప్రాణం కాపాడిన డాక్టర్ మధు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం లోని నరకూరు ప్రాంతంలో నివాసముంటున్న సుధాకర్ బంగారమ్మల రెండు సంవత్సరాల చిన్నారి లాస్య ఇంటి వద్ద ఆడుకుంటూ పిన్నీసును మింగి వేయడం జరిగింది. ఆ పిన్నిసు గొంతులో ఇరుక్కుపోవడంతో పాప కుటుంబ సభ్యులు భయాందోళనలతో బుధవారం నగరంలోని విజయ్ మహల్ గేట్ సమీపంలోని మధు గ్యాస్ట్రో హాస్పిటల్ డాక్టర్ మధు వద్దకి తీసుకువచ్చారు.. వెంటనే స్పందించిన డాక్టర్ మధు ఎండోస్కోపీ ద్వారా చిన్నారి గొంతులో ఇరుక్కున్నటువంటి పిన్నిసును తొలగించి పాపకు ప్రాణాపాయం నుంచి కాపాడారు. రుణం తీర్చుకోలేమయ్య అంటూ ఈ సందర్భంగా డాక్టర్ మధుకి వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# వెలుగుల దాత జీకేఆర్




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారి చీకటిమయంగా ఉండడంతో సిబ్బంది రోగులు అనేక అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలో ప్రయాణించాలంటే విష సర్పాల భయంతో బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వచ్చేది ఈ సమస్యను తెలుసుకున్న వింజమూరు నివాసి వెలుగుల దాత గువ్వల కృష్ణారెడ్డి తన సొంత నిధులను ఉపయోగించి రహదారి వెంబడి వెలుగులు విరజిమ్మేలా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి దానికి దీపాల అమరికను ఏర్పాటు చేశారు. సుమారు 15 స్తంభాలు ఆ స్తంభాలకు సరిపడా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు తన సొంత నిధులను వెచ్చించి ఖర్చును లెక్క చేయకుండా కేవలం ప్రజల శ్రేయస్సును వైద్య ఆరోగ్య సిబ్బంది క్షేమాన్ని కోరుకొని తన దాతృత్వాన్ని వెల్లడించాడు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని రోగుల కొరకు మరియు వైద్యులు కొరకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే సేవా దృక్పథాన్ని చూసి తాను కూడా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు.

## పదవీవిరమణ ఉద్యోగులకు ఘనంగా సన్మానం



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో భూగర్భ డ్రైన్ కార్మికులుగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన డ్రైవర్ టి.రమణయ్య, వర్కర్ బి.పరంధామయ్యలను కమిషనర్ వై.ఓ నందన్ మంగళవారం ఘనంగా సత్కరించారు. హరనాథపురం పంపింగ్ స్టేషన్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్ రావు, ఈఈ రహంతు జానీ, అనిల్‌కుమార్, డిఈఈ ముజాహిద్దీన్, ఏఈ నరేంద్ర పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే



**బోగోలు, మేజర్ న్యూస్ :** బోగోలు మండలం నాగులవరం గ్రామానికి చెందిన వైస్సార్సీపీ నాయకులు బత్తల విజయ బాబు కుమార్తె వివాహం సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించిన కావలి నియోజకవర్గ వైస్సార్సీపీ ఇన్‌చార్జ్, మాజీ శాసన సభ్యులు శ్రీ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, బోగోలు మండల అధ్యక్షుడు మద్దిబోయిన వీర రఘు, ఎంపీటీసీ సుందర్ రాజ్, అంకులయ్య తదితర నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మంత్రి ఆనంను కలిసిన సొసైటీ చైర్మన్ వనిపెంట



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని నూతనంగా ఏకగ్రీవంగా ఎంపికైనటువంటి మర్రిపాడు మండలం, బూదవాడ సొసైటీ ప్రెసిడెంట్ వనిపెంట వెంకట సుబ్బారెడ్డి బుధవారం ఆత్మీయంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనంకు శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో సత్కరించారు. తనను గుర్తించి సొసైటీ చైర్మన్ బాధ్యతలు అప్ప చెప్పినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రకృతివ్యవసాయం బహుళప్రయోజనకరం : ఏఓ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రకృతివ్యవసాయం రైతులకు బహుళ ప్రయోజనకరమని ఆత్మకూరు మండల వ్యవసాయాధికారి కె.కిషోర్‌బాబు పేర్కొన్నారు. బుధవారం కిషోర్‌బాబు ఆధ్వర్యంలో కరటంపాడు, బోయల చిరువెళ్ళ రైతుసేవా కేంద్రాల్లో రైతులకు శిక్షనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖరీఫ్2025 సీజన్‌కు సంబంధించి ఆయా రైతుసేవాకేంద్రాల పరిధిలోని రైతులకు శిక్షణాకార్యక్రమం నిర్వహించారు. ప్రకృతివ్యవసాయం వలన పంటలసాగుకు వ్యయం తగ్గుతుందని, నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఉత్పత్తులు లబిస్తాయని, గిట్టుబాటు ధర లబిస్తుందని కిషోర్‌బాబు పేర్కొన్నారు. వరి తదితర పంటలసాగులో సమగ్రయాజమాన్యపద్ధతులను పాటించినపుడే అధికదిగుబడులు పొందడంతోపాటు ఖర్చులు తగ్గించుకునే వీలుంటుందని ఆయన పేర్కొన్నారు. పొటాష్ ఎరువును తప్పనిసరిగా ఆఖరిదపాలో వాడాలని ఆయన సూచించారు. భూసారపరిక్షా ఫలితాలకను గుణంగా ఎరువులు వాడడంతోపాటు సల్ఫర్ కలిగిన ఎరువులను వరిసాగులో అవసరం లేదని ఆయన తెలిపారు. నానోయూరి యాను వరిపంటలో వాడడం వలన ఖర్చు తగ్గించుకోవడంతోపాటు నేల ఆరోగ్యం కూడా మెరుగుపరుచుకునే వీలుంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం గురించి కూడా ఆయన వివరించారు. రైతులతో కలిసి క్షేత్రపరిశీలనగావించారు. ప్రకృతి వ్యవసాయంకు సంబంధించిన ఎరువుల ప్యాకెట్లను ఆయన



రైతులకు పంపిణీ చేశారు. రైతుల సందేహాలకు ఆయన సమాధానాలిచ్చారు. వరిపొలాల్లో పర్యటించి ఆ పంటను రైతులకు చూపి తెగుళ్ళు ఉంటే నివారణ గురించి వివరించారు. ఈకార్యక్రమంలో విఏఏలు ఎన్.లక్ష్మిలహరి, ఎస్.మంజుల, ఏపిసిఎన్ఎఫ్ శాఖ సిబ్బంది పి.సుబ్బరాయుడు, బి.దొరసానమ్మ, మాధురి, విజయమ్మ, సుజాత, విజయలక్ష్మి,కరటంపాడు, బి.చిరువెళ్ళ రైతుసేవాకేంద్ర పరిధిలోని రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పులివెందులలో ప్రజాస్వామ్యం బతకడాన్ని ఓర్చుకోలేకపోతున్న జగన్ రెడ్డి

- ఒళ్లు బలిసే చంద్రబాబుపై నోటికొచ్చినట్టు వ్యాఖ్యలు
- నోరు అదుపులో పెట్టుకోకపోతే జగన్ రెడ్డి అండ్ బ్యాచ్ ఫలితం అనుభవించక తప్పదు
- మీడియాతో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డి ఒళ్లు బలిసి మాట్లాడుతున్నారని, 30 ఏళ్ల తర్వాత తొలిసారిగా పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికకు నామినేషన్లు దాఖలు కావడం, పోలింగ్ జరగడంతో ఓర్చుకోలేకపోతున్నారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబుపై నోటికొచ్చినట్లు వైఎస్ జగన్ మాట్లాడటం సరికాదన్నారు. ఇవే చివరి ఎన్నికలని, కృష్ణా రామ అని జపం చేసుకోవాలని, నరకానికి పోతారని అంటూ చంద్రబాబు నాయుడుపై నోరు పారేసుకుంటున్నారన్నారు. కుప్పం ఎన్నికల్లో అరాచకంతో గెలిచి ఆ రోజు కూడా చంద్రబాబు నాయుడు గురించి హేళనగా మాట్లాడారన్నారు. రాముడు, కృష్ణుడు జపం చేసుకుంటూ ఇంట్లో కూర్చోలేదు.. అనుక్షణం లోక కళ్యాణం కోసం తపించారన్నారు. చంద్రబాబు నాయుడు కూడా రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల కోసం నిత్యం పోరాటం సాగిస్తున్నారన్నారు. క్రమశిక్షణ, కష్టపడే తత్వానికి మారుపేరైన చంద్రబాబు నాయుడు పేరెత్తే అర్హత జగన్‌రెడ్డికి లేదన్నారు. జగన్‌రెడ్డితో పాటు ఆయన అనుచరుల్లో ఒళ్లు బలిసిన వారి సంగతి తేల్చే బాధ్యత యువ నాయకుడు లోకేష్ బాబు చేపట్టారన్నారు. వైసీపీ పాలనలో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా అరాచకాలు సృష్టించి నామినేషన్లు వేయలేని పరిస్థితి కల్పించారన్నారు. ఇప్పుడు 30 ఏళ్ల తర్వాత పులివెందులలో జెడ్పీటీసీ ఎన్నిక ప్రజాస్వామ్యయుతంగా జరుగుతుంటే ఓర్చు కోలేక ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని, వంగి కొబ్బరికాయ కొట్టలేని జగన్‌రెడ్డి.. తమ నాయకుడు చంద్రబాబు గురించి మాట్లాడటం బాధగా ఉందన్నారు. రోజులో 12 గంటలు నిరంతరంగా పని చేయగల శక్తి మా చంద్రబాబు నాయుడి సొంతం అని, నిరంతరం ఆయన ప్రజల కోసమే తపిస్తుంటారన్నారు. ఇంటర్నేషనల్ స్కామ్ అయిన లిక్కర్ కేసులో సిట్ రోజుకో అంశాన్ని వెలికితీస్తుండటంతో గందరగోళానికి గురవుతున్న జగన్ రెడ్డి నోటిపై అదుపు కోల్పోతున్నారన్నారు. రాజకీయాల్లోకి రావాలంటే నాయన చనిపోవాలి.. సీఎం కావాలంటే చిన్నాయన హత్యకు గురవ్వాలి.. ఇదీ జగన్మోహన్ రెడ్డి స్ట్రాటజీ అన్నారు. ప్రజాసేవలో ఎంతో అనుభవం కలిగిన చంద్రబాబు నాయుడు బ్యాక్ గ్రౌండ్ ఏమిటి.. జగన్ రెడ్డి బ్యాక్ గ్రౌండ్ ఏంటి.. ఇకనైనా ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని జగన్మోహన్ రెడ్డికి హితవు పలికారు. లేదంటే ఫలితం అనుభవించక తప్పదన్నారు.

# ఉర్దూపాఠశాలలను తనిఖీ : డీఐ ఖాజామొహిద్దీన్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలోని పలు ఉర్దూపాఠశాలలను జిల్లా ఉర్దూ ఉపతనిఖీ అధికారి ఖాజామొహిద్దీన్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. మండలంలోని అశ్వనీపురం, కరటంపాడు, మహిమలూరులోని ఉర్దూ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని కూడా పలు ప్రశ్నలతో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాలకు సమయానికి హాజరుకావాలని, శ్రద్ధాసక్తులతో అభ్యసిస్తేనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందన్నారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఉర్దూపాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్‌లు తక్కువగా ఉన్నాయని, పెంచేందుకు కృషిచేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో యదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించినపుడే అడ్మిషన్లు పెరుగుతాయన్నారు. ఎఫ్ఏ1 పరిక్షల మార్కులను ఆన్‌లైన్ చేయాలని, విద్యార్థులు డ్రాపవుట్ లేకుండా చూడాలని ఆయన సూచించారు. రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులకు పలుసూచనలు చేశారు. అనంతరం ఖాజామొహిద్దీన్ విద్యార్థులతో కలిసి డొక్కాసీతమ్మమధ్యాహ్న భోజనకార్యక్రమంలో ఆయన పాల్గొని వారితోపాటు ఆయనకూడా భోజనం చేశారు. సంతృప్తికరంగా ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వధువును ఆశీర్వదించిన టిడిపి నాయకులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం బట్టేపాడులో మండల బిజెపి అధ్యక్షుడు వాసిపల్లి సుధాకర్‌రెడ్డి-లక్ష్మిల కుమార్తె సుష్మారెడ్డి వివాహనలుగు సందర్భంగా పలువురు తెలుగుదేశం నాయకులు పాల్గొని వధువును ఆశీర్వదించారు. సుష్మారెడ్డి-గురవారెడ్డిల వివాహం గురువారం నెల్లూరులో జరుగనుండగా బుధవారం స్వగృహంలో నలుగు కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరు పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, టిడిపి సీనియర్ నాయకుడు కేతా విజయభాస్కరరెడ్డి, జిల్లా తెలుగుయువత నాయకుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, బట్టేపాడు ఎంపిటిసి మెంబర్ డాక్టర్ తూమాటి శశిధర్‌రెడ్డి, టిడిపి నాయకులు పయ్యావుల ప్రభాకర్‌నాయుడు, చంద్రా శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొని వధువు సుష్మారెడ్డిని ఆశీర్వదించి ఆమె తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు.

# దివ్యాంగులకు విద్యా ఉపకరణాలకిట్లు పంపిణీ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని వెస్ట్‌స్కూల్ భవిత కేంద్రంలో బుధవారం దివ్యాంగ విద్యార్థులకు మండల విద్యాశాఖాధికారిణి అనంతలక్ష్మి విద్యకు సంబంధించిన ఉపకరణాలతోకూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా అనంతలక్ష్మి ప్రసంగిస్తూ ఎస్ఎస్ఏ, అలిమ్‌కో ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు సమకూర్చిన ఈ కిట్లను అందజేశామన్నారు. కిట్ల పంపిణీ సంతోషదాయకమని ఆమె పేర్కొన్నారు. తల్లిదండ్రులకు భవితకేంద్రాల ప్రయోజనాలు, రాయితీలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలను గురించి ఆమె వివరించారు. ప్రధానంగా పిజియోథెరపి సేవలు సమర్ధవంతంగా వినియోగించుకోవాలని ఆమె సూచించారు. భవిత కేంద్రాలను దివ్యాంగ చిన్నారుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తుందని, అక్కడ ఉన్న అవకాశాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐయిఆర్‌పిలు కాటంగారి పద్మ, ఆళ్ళ జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్‌కు టీడీపీ నేతల నివాళులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మాజీ సర్పంచ్ గుండాల హనుమాన్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా బుధవారం తెలుగుదేశం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆత్మకూరు మేజర్‌పంచాయతీగా ఉన్న సమయంలో హనుమాన్‌రెడ్డి సర్పంచ్‌గా వ్యవహరించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు, త్రాగునీటి పథకాలు సాధించారని, రోడ్డు విస్తరణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారని, ఆర్టీసీ బస్సులు పట్టణంలోని మున్సిపల్ బస్టాండుకు వచ్చేలా ఇతోధికకృషి చేశారని, ప్రజలు ఆయన సేవలను తరచూ గుర్తుచేసుకుంటుంటారని టిడిపి నాయకులు చంద్రారెడ్డి తదితరులు పేర్కొంటూ ఆయనను స్మరించుకొని నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు సూరా భాస్కరరెడ్డి, పొడమేకల పెంచలయ్యయాదవ్, షేక్ మహబూబ్ బాషా, జిల్లా తెలుగుయువత నాయకుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు-ముంబాయి జాతీయరహదారిపై ఆత్మకూరు మండలం వాసిలి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్వర్ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. వాసిలికి చెందిన అన్వర్ తన మోఫెడ్‌పై స్వగ్రామానికి వెళుతుండగా నెల్లూరునుండి బద్వేలువైపు వెళుతున్న ఒక కారు వేగంగా వచ్చి ఆ మోఫెడ్‌ను ఢీకొట్టగా అన్వర్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ షేక్ జిలానీ హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకై ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# మృతుడి కుటుంబానికి టీడీపీ నేతల ఆర్థికసాయం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం అశ్వనీపురంలో విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన సయ్యద్‌లతీఫ్ కుటుంబానికి తెలుగుదేశం నాయకులు బుధవారం తమవంతుగా 10వేల రూపాయలను సాయమందించారు. సయ్యద్‌ఖాజారసూల్ కుమారుడైన లతీఫ్ ఇంట్లో ఏసీ బిగిస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. లతీఫ్ అంత్యక్రియలకుగాను నువ్వురుపాడు గ్రామ టిడిపి ప్రధానకార్యదర్శి షేక్ ఖాజావలి, ఆయన సోదరుడు చిన్నఖాజావలిలు 10వేలరూపాయల ఆర్థికసాయాన్ని మృతుడి కుటుంబానికి అందజేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ఈసందర్భంగా మృతుడి కుటుంబసభ్యులు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో టిడిపి యువనాయకుడు వీరపురెడ్డి సుదర్శన్‌రెడ్డి, టిడిపి క్లస్టర్ ఇన్‌చార్జ్, ఏపిరెడ్డి సంక్షేమసంఘ జిల్లా అధ్యక్షుడు కొండ్రెడ్డి రమణారెడ్డి, పలువురు టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మైనింగ్ కోసం ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలి

## రైతు కూలీ సంఘం, ఏఐఎఫ్‌టీయు న్యూ డిమాండ్



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** నివాస ప్రాంతం మధ్యలో ఉన్న జంగంరెడ్డిపల్లి తిప్పను మైనింగ్ చేసుకోవడానికి ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలనిఏఐఎఫ్టియు న్యూ జిల్లా నాయకులు ఎల్ లక్ష్మిరెడ్డి, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివి రమణయ్య లు డిమాండ్ చేశారు. బుధవారం వరికుంటపాడు,జంగం రెడ్డిపల్లి గ్రామాల్లో రైతు కూలీ సంఘం, ఏఐఎఫ్టియు న్యూ నాయకులు పర్యటించారు. ఆయా గ్రామస్తుల ను కలిసి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రమైన వరికుంటపాడు పంచాయతీ పరిధిలో ఉన్న జంగంరెడ్డిపల్లి తిప్పను నంద్యాలకు చెందిన పోచ వెంకట్ రెడ్డి మినరల్స్ మైనింగ్ కంపెనీకి కట్టబెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.మా గ్రామాలకు ఆనుకుని ఉన్న ఈ తిప్పను మైనింగ్‌కు ఇస్తే నివాసం ఉండలేమని, ఈ తిప్పల మీద మేకలు, గొర్రెలు, పశువులు తిరగలేవని గ్రామస్తులు వాపోయారు. మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభమైతే పేలుళ్ళ, తవ్వకాలతో ఇల్లు దెబ్బతింటాయి, పంటలు నాశనం అవుతాయని తమ తమ గోడు నెల్లపుచ్చుకున్నారు. అభివృద్ధి పేరుతో గ్రామాలను విధ్వంసం చేయడం మానుకోవాలన్నారు. ఈ ప్రాంతాన్ని మైనింగ్ తవ్వకాలకు ఇవ్వడం అంటే ప్రజలు జీవించే హక్కును కాలరాయడమేనన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడిన వారంతా ముక్తకంఠంతో తమ గ్రామంలో మైనింగ్ అనుమతులు ఇవ్వవద్దని తెలిపినప్పటికీ దొడ్డిదారిన తీర్మానాలు చేసుకొని కంపెనీకి అనుమతులు మంజూరు చేయడం ప్రజలను మోసగించడమేన న్నారు. విలువైన ఖనిజ సంపదను ప్రకృతి వనరులను భవిష్యత్ తరాలకు ఉంచాల్సిన పాలకులు కార్పొరేట్ కంపెనీలు సంపదను లూటీ చేసుకోవడానికి అనుమతి ఇవ్వడం సిగ్గుచేటు అన్నారు.ప్రజలు చేస్తున్న న్యాయమైన పోరాటానికి మేము సంపూర్ణంగా మద్దతిస్తున్నామని అన్నారు.మైనింగ్ కంపెనీకి ఇచ్చిన అనుమతులను రద్దు చేయకపోతే ప్రజలందరితో కలిసి కార్యకలాపాలను అడ్డుకుంటామని, ఆందోళనను ఉదృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్ సుబ్బరాయులు తదితరులు పాల్గొన్నారు.

# కళాశాలలో ప్రపంచ అవయవదాన దినోత్సవం




**కావలి, మేజర్‌న్యూస్ :** ప్రతి సంవత్సరం ఆగస్టు 13వ తేదీన ప్రపంచ అవయవ దాన దినోత్సవం జరుపుకుంటారు. ఆదే క్రమంలో కావలి డిబిఎస్ కళాశాలలో మంగళవారం ఆ అవయవ దానంపై లైన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు వారి ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు మందిని వారి శరీర అవయవాల పైన క్షీణితను కలుగజేస్తుందని ధూమపానం చేయడం వల్ల అనేక అనారోగ్యాలకు కారణమవుతుందని ధూమపానం చేసే వారికి వ్యాధు లు తప్పవని దీని వలన క్యాన్సర్, బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్ స్ట్రోక్ వచ్చే ప్రమా దాలు ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయితే మెదడుకు తగినంత రక్తప్రసరణను అందించడంలో ఇబ్బందులు తలెత్తుతాయని ఇటీవల జరిగిన అధ్యాయంలో ధూమపానం వల్ల స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నా యని వారు తెలిపారు 80శాతం ఊపిరితిత్తుల క్యాన్సర్ ధూమపానం వలన వస్తుందని పలు అధ్యయనాలు పలు శాస్త్రవేత్తలు చెపుతున్నప్పటికీ ప్రజలు వాటి విషయంలో అశ్రద్ధగా నిర్లక్ష్యంగా ఉన్నారని తెలిపారు. ధూమపానం వలన అన్నవాహిక, మూత్రపిండాలు, కాలేయం, గర్భాశయం, మూత్ర శయం, వంటి ఇతర వ్యాధులు క్యాన్సర్లు ప్రమాదం కూడా పెంచుతుందని తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులు ఎయిడ్స్ వ్యాధిపై కూడా అవగాహన కల్పించారు. అలాగే హెచ్ఐవి కూడా ఎలా సోకుతుంది రక్షణ లేకుండా శారీరిక సుఖంలో పాల్గొన్న, హెచ్ఐవి ఉన్నవారికి వాడిన సూదులు ఇతరులకు వాడడం వల్ల అంటు వ్యాధిగా ప్రబలుతుందని తెలిపారు. ఇవి విద్యార్థిని, విద్యార్థులకు ప్రబలకుండా వాటిపై ఎటువంటి జాగ్రత్తలు తీసు కోవాలో తగు సూచనలు సలహాలు అలాగే వ్యాధి నిరోధక శక్తి ఎలా పెంచు కోవాలో వాటికి ఉపయోగపడే ఆహార పదార్థాలు గురించి కూడా వివరిం చారు. ఈ కార్యక్రమంలో డీబీఎస్. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీవీ రావు, లైన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు ప్రెసిడెంట్ ఏ.కాశి, టి.కృష్ణ, కుమార్ ఎం.మోహన్ రావు, వైవి రావు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి బుధవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కావలి పట్టణం బృందావనం కాలనీకి చెందిన పబ్బతి వెంకటేశ్వరరావు - భాగ్యలక్ష్మి దంపతుల కుమారుడు ప్రసన్న వెంకటసాయి శ్రీనాథ్ వివాహ రిసెప్షన్ కార్యక్రమం బృందావనం కాలనీలోని కళ్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కావలి పట్టణం జనతా పేట నార్త్ కు చెందిన గంటా విజయకుమార్ - మనోరమ దంపతుల కుమార్తె గీతాంజలి వివాహ నలుగు కార్యక్రమం వారి నివాసంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. కావలి రూరల్ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన మానం వేణు, ప్రమీల దంపతుల కుమార్తె లక్ష్మి ప్రియ వివాహ నలుగు కార్యక్రమం వారి నివాసంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. కావలి రూరల్ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన యెందేటి ప్రసాద్ - కోటేశ్వరమ్మ దంపతుల కుమార్తె మేఘన వివాహ నలుగు కార్యక్రమం వారి నివాసంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. కావలి రూరల్ మండలం సిరిపురం గ్రామానికి చెందిన కన్నె కేశవులు - లావణ్య దంపతుల కుమార్తె దివ్య వివాహ నలుగు కార్యక్రమం వారి నివాసంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. కావలి పట్టణం కో-ఆపరేటివ్ కాలనీ కి చెందిన రెవిన్యూ ఉద్యోగి బాలాజీ సింగ్ ఉత్తర క్రియల కార్యక్రమం వారి నివాసంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని బాలాజీ సింగ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కావలి పట్టణం బాపూజీ నగర్ కు చెందిన రామిరెడ్డి వెంకట రమణారెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యేకావ్య క్రిష్ణారెడ్డి బుధవారం వారి నివాసానికి చేరుకుని రమణారెడ్డి భౌతిక ఖాయాన్ని దర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## ఉత్తరక్రియలకు ప్రముఖుల హాజరు

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు బివి రమణ తండ్రి బివి రత్నయ్య ఉత్తర క్రియలు కచ్చి దేవరాయపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆత్మకూరు నియోజకవర్గం జన సేన పార్టీ ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్, ఆత్మకూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు కంటే శ్రీనివాస్ భరత్ బివి రత్నయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గం జనసేన పార్టీ సీనియర్ నాయకులు జెపి ప్రసాద్ రాయల్,జనసేన ఆత్మకూరు టౌన్ నాయకులు మాధవ శెట్టి, తదితరులు పాల్గొన్నారు.

## అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా అన్వర్ భాష



**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నెల్లూరు యువ న్యాయవాది షేక్ అన్వర్ భాషాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.వీరు ప్రభుత్వం తరఫున సివిల్ కేసులలో వాదిస్తారు. వృత్తిలో అంకితభావంతో నిబద్ధతతో వ్యవహరించే అన్వర్ బాషాకు ఈ పదవి రావడం పట్ల సీనియర్ జూనియర్ న్యాయవాదులు హర్షం వెలిబుచ్చారు. ఈ పదవిలో మూడేళ్లపాటు కొనసాగుతారు. ఈయనకు నెలకు పదివేల రూపాయలు గౌరవ వేతనం చెల్లిస్తారు. ఏజీపీగా నియమితులైన సందర్భంగా అన్వర్ భాషను పలువురు న్యాయవాదులు అభినందించారు.

## ఎన్‌పీసీఐ అనుసంధానంపై శ్రద్ధ వహించాలి




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయ పరిధిలోని వింజమూరు, కలిగిరి మండలంలో వసతి గృహాల్లోని విద్యార్థుల తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాకుఎన్ పీసీ ఐ అనుసంధాన ప్రక్రియపై వెల్దుర్తి సహాయకులు శ్రద్ద వహించాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రమణారెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం స్థానిక కార్యాలయంలో వింజమూరు కలిగిరి మండలాల వెల్ఫేర్ అసిస్టెంట్ తో సమావేశం నిర్వహించారు. వసతిగృహ పరిధిలో తల్లికి వందనం నగదు జమకాని విద్యార్థులను గుర్తించివారి తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాకు ఎన్ పీ సీఐ అనుసంధానాన్ని త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. అనంతరం పలు అంశాలపైసమీక్షించారు.

## వివిధ అంశాలపై ప్రిన్సిపల్ సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సంపత్ కుమార్ లు వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ కాన్ఫరెన్స్ విభాగం నుంచి నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్, అన్ని విభాగాల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో ఇంజనీరింగ్ విభాగం ఎస్‌ఈ రామ్ మోహన్ రావు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, టిపిఆర్ఓ వాసు బాబు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి, సిటీ ప్లానర్ హిమబిందు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## పంట సాగు చేసిన రైతులు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పంట సాగు చేసిన రైతులు తప్పనిసరిగా రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించి తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఉదయగిరి మండల వ్యవసాయ అధికారి విజయ భాస్కర్ సూచించారు. ఉదయగిరి మండలం శకునాలపల్లి, కృష్ణం పల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు మేరకు మాత్రమే ఎరువులు పురుగు మందులు వినియోగించాలని సూచించారు. రైతులు పంట మార్పిడి పద్ధతి అవలంబించాలని సూచించారు. అప్పసముద్రం గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో రైతు శిక్షణా కార్యక్రమాన్ని సైతం నిర్వహించారు. కార్యక్రమంలో ఉదయగిరి ఉద్యానశాఖ అధికారి జయశ్రీ, వీఏఏ వెంకటపతి, విహెచ్ఎ శేఖర్ పాల్గొన్నారు.

# వర్షపు నీరు రోడ్లపై లేకుండా చూడండి : కమిషనర్



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో లోతట్టు ప్రాంతపు డివిజన్లలో వర్షాల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకొని, రోడ్లపై వర్షపు నీరు చేరకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని కమిషనర్ వైఓ నందన్ ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ బుధవారం స్థానిక ఎన్టీఆర్ నగర్, బాలాజీ నగర్, ఏసీ నగర్, ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని అండర్ బ్రిడ్జి, విజయ్ మహల్ గేటు బాక్స్ టైపు బ్రిడ్జి తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో డ్రైను కాలువలను మూసివేస్తూ చేపట్టిన నిర్మాణాలను గుర్తించిన కమిషనర్, వెంటనే వాటిని తొలగించి పూడికతీతకు అడ్డంకి లేకుండా చూడాలని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. అన్ని డివిజన్లలో డ్రైను కాలువలపై అక్రమంగా నిర్మించిన ర్యాంపులు, మెట్లు, ఇతర నిర్మాణాలను గుర్తించి వాటిని యజమానులే స్వచ్ఛందంగా తొలగించుకునేలా నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అనంతరం స్థానిక ఏసీ నగర్ ప్రాంతంలో ఆధునికీకరణ జరుగుతున్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పనులను కమిషనర్ పర్యవేక్షించారు. నిర్దేశించిన సమయంలోపు పనులను పూర్తి చేసి తాగునీటి ట్యాంకు ద్వారా స్వచ్ఛమైన నీరు ప్రజలకు సరఫరా చేసేలా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి, విజయ మహల్ గేట్ బాక్స్ టైపు బ్రిడ్జి, రామలింగాపురం అండర్ బ్రిడ్జి, మాగుంట లేఔట్ అండర్ బ్రిడ్జి ప్రాంతాలలో వర్షపు నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు మోటార్ల సాయంతో నీటిని తోడివేయాలని కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 13వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాపరెడ్డి, నెల్లూరు నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్ మోహన్ రావు, సిటీ ప్లానర్ హిమబిందు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనిల్ కుమార్, స్థానిక ప్రజా ప్రతినిధులు, వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# బిట్రగుంట రైల్వే అభివృద్ధిపై బీజేపీ అధ్యక్షునికి వినతి



**బోగోలు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు పట్టణంలో బుధవారం నిర్వహించిన సారధ్య సభకు విచ్చేసిన రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పివిఎన్ మాధవ్‌ను బోగోలు మండల బీజేపీ నాయకులు కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసిన బిట్రగుంట రైల్వే అభివృద్ధికి కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు. రైల్వేకు చెందిన సుమారు 700 ఎకరాల భూమి బిట్రగుంటలో నిరుపయోగంగా ఉందని దానిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సద్వినియోగం చేసుకొని బిట్రగుంట అభివృద్ధి చిందేందుకు కృషి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన రాష్ట్ర అధ్యక్షులు బిట్రగుంట అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హైకమాండ్ దృష్టికి తీసుకువెళ్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు వీరాల శ్రీనివాసులు, నూక సాని శ్రీనివాస్ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు, గుర్రం వెంకటేశ్వర్లు, గోపి వెంకటకృష్ణ పసుపులేటి సూర్యులు గోవిందరాజు, రాచూరి కిషోర్, ఆవుల అరుణ్ కుమార్, సీనియర్ నాయకులు కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వైద్యఆరోగ్య సిబ్బంది సామాజికసేవల్లో అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా వైద్యాధికారిణి సుజాత



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** వైద్య,ఆరోగ్య సిబ్బంది ప్రజారోగ్యం పట్ల, అందించాల్సిన సేవల పట్ల అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ జి.సుజాత సూచించారు. ఆమె బుధవారం ఆత్మకూరు అర్బన్ పిహెచ్‌సి పరిధిలోని నెల్లూరుపాళెం గిరిజనకాలనీలో టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాతీయిమ్మ్యునైజేషన్ కార్యక్రమం జరుగుతుండగా ఆవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులను 12వారాల్లోగా రిజిస్ట్రేషన్ చేయాలని, వాళ్ళకు బిపి, సుగర్,ఎత్తు,బరువు,రక్తం తదితర పరిక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. 12వవారంలో టిడి ఇంజక్షన్ వేసి ఐరెన్ మాత్రలు ఇవ్వాలన్నారు. హైరిస్క్ ఉండేవారిని డాక్టర్‌కు చూపించాలని డాక్టర్ సుజాత సూచించారు. బాలింతలకు ఇమ్మ్యునైజేషన్ షెడ్యూల్‌ప్రకారం, పిల్లలకు వ్యాదినిరోధకటీకాలను సకాలంలో వేయించాలన్నారు. బిసిజి, పొంటా 1, 2, 3, ఎంపి 1, 2లు తప్పకుండా వేయించాలని ఆమె సూచించారు. గర్భవతులు, తల్లులకు పౌష్టికాహారం గురించి ఆమె వివరించి అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కూడా డామె సూచించారు. వర్షాకాలం అయినందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటినిల్వలు లేకుండా చూసుకోవాలని తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ సుజాత కోరారు. నీరు నిల్వ ఉంటే డెంగ్యు, మలేరియా, చికెన్‌గున్యా తదితర వ్యాధులు వ్యాప్తిచెందుతాయని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్రైడే(శుక్రవారం)ను డ్రైడేగా పాటించాలని, వ్యాదులు నిర్మూలించుటకు సహకరించాలని ఆమె కోరారు. ఈకార్యక్రమంలో అర్బన్ పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ షేక్ అస్మా, ఎంపిహెచ్‌యివో సిద్ధం సుధాకర్, డియిటిసి రమణ, ఏఎన్ఎం రాఘవరాణి, ఆశాకార్యకర్త షాహినా, మస్తానమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త ఏ.మస్తానమ్మ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# సొసైటీ చైర్మన్ డైరెక్టర్లకు ఘన సన్మానం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు సొసైటీకి నూతన చైర్మన్గా ఎంపికైన చల్ల వెంకటేశ్వర్లు యాదవ్, డైరెక్టర్లు కోడూరు నాగిరెడ్డి గని శ్రీనివాసులకు ఘన సన్మానం జరిపించారు. బుధవారం సొసైటీ సీఈవో మేకల రమణయ్య సిబ్బంది కలిసి చైర్మన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సొసైటీ అభివృద్ధి పథంలో పయనించాలని రైతన్నల సమస్యలకు సత్వరమే పరిష్కారం అందించి వారి సంక్షేమాన్ని కృషి చేయగలరని ఆకాంక్షించారు. చైర్మన్‌గా ఎన్నికైన వెంకటేశ్వర్లు యాదవ్ గతంలో టిడిపి కష్టకాలంలో ఉన్న సమయంలో కూడా మండలాధ్యక్షుడుగా ఉండి పార్టీని బలోపేతం చేసి పార్టీ విజయాన్ని కృషి చేశారన్నారు పార్టీ కోసం నిలబడి నిరంతర శ్రమను కొనచ్చారన్నారు అలాగే. సొసైటీ పరిధిలోని రైతన్నల సమస్యలను తెలుసుకుంటూ వాటిని పరిష్కరించేందుకు ఎల్లవేళలా కృషి చేయగలరని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాసులు యాదవ్ దిద్దుగుంట శ్రీనివాసులరెడ్డి సొసైటీ సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సూర్య

# విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని సంగం, కొడవలూరు, మనుబోలు, అల్లూరు, దగదర్తి, కొండాపురం, కలిగిరి, కలవాయి, విడవలూరు, ఇందుకూరుపేట, కోవూరు, నెల్లూరు పట్టణంలోని దర్గామిట్ట, స్టోన్ హౌస్‌పేట, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా,
కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు

9000118811, 9000483583

# ఓవర్ హెడ్ ట్యాంక్ పరిశీలన : మున్సిపల్ కమిషనర్



**కావలి, మేజర్‌న్యూస్ :** కావాలి పురపాలక సంఘ పరిధిలో ఉన్న ముసునూరులోని 14, 15వ వార్డుల నందు ప్రజలు త్రాగునీటి కొరకు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్ బుధవారం తాగునీటి సమస్య పరిష్కారం కోసం మాగుంట పార్వతమ్మ లేఔట్ నందు ఉన్న మున్సిపల్ బావిని పరిశీలించి, అలాగే ముసునూరు గ్రామం నందు ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌ను పరిశీలించి నీటి కొరతను పరిష్కరించేందుకు కావలి నియోజకవర్గం ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి చొరవతో పది లక్షల మేరకు నిధులు మంజూరు అయినందున త్వరలోనే ముసునూరు తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగా విపత్తులు, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యువకుడి దారుణ హత్య



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలో చిన్న బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అలంకార్ సెంటర్ విక్టోరియా గార్డెన్స్ వద్ద మూలాపేటకు చెందిన షేక్ లైక్ (30) అనే యువకుడు బుధవారం దారుణ హత్యకు గురయ్యాడు. పాల ప్యాకెట్ కోసం వెళ్లిన యువకుడిని ఇద్దరు గుర్తు తెలియని యువకులు కత్తులతో దారుణంగా హతమార్చారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న చిన్న బజార్ పోలీసులు. మృతుడు చిన్న బజార్ పరిధిలోని అందరికీ సుపరిచితుడని అంతేకాకుండా ఇస్కాన్ టెంపుల్ నందు గోవులను సంరక్షణ చేసేవాడని, క్యాటరింగ్ సైతం నిర్వహిస్తున్నారని ఈ క్రమంలో మృతుడికి మరో వ్యక్తికి గత కొంత కాలంగా మనస్పర్ధలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతదేహాన్ని పరిశీలించి పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనా స్థలం వద్ద మృతిని భార్య పిల్లలు వారి బంధువులు బోరున విలపించారు. ఈ ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి త్వరలోనే నిందితులను పట్టుకుంటామని చిన్నబజార్ పోలీస్ స్టేషన్ సీఐ కోటేశ్వరరావు తెలియజేశారు.

# వీవర్స్‌కాలనీలో సమస్యల పరిష్కారం ఎన్నటికో..

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో పట్టణంనుండి నెల్లూరుపాళెం మార్గంలో ఉన్న వీవర్స్‌కాలనీ అనాదిగా సమస్యలతో సతమతమవుతున్నా.. పాలకులెవ్వరూ పట్టించుకోవ డం లేదని వారంతా వాపోతున్నారు. ఈకాలనీలో ఆక్రమణదారులు, రోడ్డు వెంబడి వ్యాపారులు మాత్రం అధునాతన భవంతులు నిర్మించుకోగా చేనేత కార్మికులు మాత్రం గతంలో ప్రభుత్వం ఇచ్చిన చిన్నపాటి ఇళ్ళలో ఉంటుండగా ఆ ఇళ్ళు శిధిలావస్థకు చేరుకున్నాయని, మరమ్మత్తులు చేయించాలని వారు దశాబ్దాలతరబడి మొర పెట్టుకుంటున్నా పట్టించుకుంటున్న నాధుడే లేరు. పాతికేళ్ళ క్రితం అక్కడ చేనేత కార్మికులకు ప్రభుత్వం చిన్నపాటి గృహాలను మంజూరు చేయగా వారు నిర్మించుకున్నారు. ఆ చిన్న ఇళ్ళలో తీవ్రంగా ఇబ్బందిపడుతున్న పరిస్థితిని గమనించిన అప్పటి ఆత్మకూరు శాసనసభ్యులు డాక్టర్ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి రాష్ట్ర ఆర్థికసంస్థ చైర్మెన్‌గా ఉంటూ ఆ సంస్థ ద్వారా చేనేతకార్మికులు మగ్గాల ఏర్పాటుకు ఆర్థికసాయ మందించారు. ఈ కాలనీలో రోడ్లు మట్టిరోడ్లకే పరిమితం కాగా డ్రేనేజి కాలువలు లేవు., అసలే లోతట్టు తేలికనేలలో ఈ కాలనీ ఏర్పాటైనందున చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లు బురదమయమై కాలుపెట్టలేని పరిస్థితి ఏర్పడుతుంటుంది. ఇళ్ళలోకి కూడా నీరు చేరుతుంది. సైడుకాలువలు లేనందున ఆనీరు పొంగి రోడ్లపైనే పారుతుంటాయి. 50కుటుంబాల వారు ఉన్న ఈ కాలనీలో కనీస మౌళికవసతులు లేక కొందరు తిరిగి ఇతరప్రాంతాలకు నివాసాలు మార్చుకున్నారు. తమ కాలనీనుండి రోడ్డువెంబడి ఒక కిలోమీటరుదూరంలోని ఆత్మకూరు పట్టణానికి విద్యాభ్యాసం కోసం తమ పిల్లలు వెళ్ళడం అత్యంత ఇబ్బందిగా ఉంటుందని, ఒక పాఠశాల ఏర్పాటు చేయాలని 15సంవత్సరాలుగా వారు కోరుతూనే ఉన్నా ఫలితం లేకపోయింది. గతంలో ఒక ప్రత్యామ్నాయ పాఠశాల ఏర్పాటు చేయగా వారికి సౌకర్యంగా ఉండగా నూతన



విద్యావిధానం అంటూ ఆ పాఠశాలను తీసివేశారు. గతంలో ఈ కాలనీ ఒక విచిత్ర పరిస్థితి ఎదుర్కొంటుండేది. కాలనీవాసుల ఓట్లు మాత్రం ఆత్మకూరు గ్రామ పంచాయతీలో ఉండేవి. కాలనీ మాత్రం నెల్లూరుపాళెం పంచాయతీలో ఉండేది. దాంతో వారి సమస్యలు నెల్లూరుపాళెంవారు పరిష్కరించాలంటే ఓట్లువేసి ఆత్మకూరు పాలకులను ఎన్నుకున్నందున వారే పరిష్కరించాలని నెల్లూరుపాళెం పంచాయతీవారు అంటుండేవారు. అదేమాట ఆత్మకూరు పంచాయతీవారు కూడా చెబుతుండేవారు. 2012లో ఆత్మకూరు మున్సిపాలిటీగా ఏర్పడగా నెల్లూరుపాళెం పంచాయతీ కూడా ఈ మున్సిపల్ పరిధిలో చేరడంతో వీవర్స్‌కాలనీ కూడా మున్సిపాలిటీలో చేరింది. కానీ వారి సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. గతంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉండగా కొంతమేరకు పరిష్కారమైంది. రోడ్లు, డ్రైనేజి, పాఠశాల, కాలనీగృహాలకు మరమ్మత్తులు, చేనేతకు సంబందించి మరమగ్గాలను సమకూర్చడం తదితర సమస్యలు గురించి ఇప్పటికైనా పాలకులు, అధికారులు పట్టించుకోవాలని, పరిష్కార చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# విద్యుత్‌స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా సిపిఎం నిరసన




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** విద్యుత్ వినియోగదారుల సర్వీసులు బాగున్నా ప్రస్తుతం ఉన్న విద్యుత్‌మీటర్లను తొలగించి స్మార్ట్‌మాటర్ల ఏర్పాటుచేస్తుండ డాన్ని వ్యతిరేకిస్తూ ఆత్మకూరులోని విద్యుత్ కార్యాలయం ఎదుట మంగళ వారం సిపిఎం నాయకులు, కార్యకర్తలు, వినియోగదారులు నిరసన కార్య క్రమం నిర్వహించారు. ఈమేరకు అధికారులకు ఒక వినతిపత్రం అంద జేశారు. ఈసందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కె.డేవిడ్‌రాజు మాట్లా డుతూ.. పట్టణంలోని అన్నిక్యాటగిరిల విద్యుత్ వినియోగదారుల కరెంటు మీటర్లు సక్రమంగా ఉన్నాయని, అయినా వినియోగదారుల అభీష్టానికి వ్యతిరేకంగా వాటిని తొలగించి స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేస్తున్నారన్నారు. అందువలన వినియోగదారులతో ఆందోళనకు దిగాల్సి వచ్చిందన్నారు. విని యోగదారుల అనుమతిలేకుండా స్మార్ట్‌మీటర్లు బిగించడం అన్యాయమ న్నారు. స్మార్ట్‌మీటర్లతో వినియోగదారుల విద్యుత్ బిల్లులు పెరిగే అవకాశం ఉందన్నారు. సబ్సిడీలు రద్దవుతాయని ఆయన పేర్కొన్నారు. వివిద తరగతుల వారికి లబించే రాయితీలు రద్దవుతాయన్నారు. ఏనాడు లేని విధంగా విద్యుత్ వాడేసమయం సాయంత్రం 6గంటలనుండి రాత్రి 10గంటల వరకు అధికరేట్లు వసూలు చేసే అవకాశం ఉందన్నారు. పగలు ఒకరేటు, రాత్రి ఒకరేటు విధించేలా ఈ మీటర్లున్నాయని ఆయన పేర్కొన్నారు. స్మార్ట్‌మీటర్లవలన విద్యుత్ వినియోగదారులు ఇబ్బందిపడుతున్న పరిస్థితుల దృష్ట్యా ఆదానీ స్మార్ట్‌మీటర్లను బిగించే నిర్ణయాన్ని విత్యుత్ యాజ మాన్యం రద్దుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. కొన్ని సంవత్సరాల పాటు స్మార్ట్‌మీటర్లను బిగించే నిర్వహణాబాధ్యత ఆదాని కంపెనీకి అప్పగించారని, క్రమీణా విద్యుత్‌రంగం మొత్తం ప్రవేటు కంపెనీలచేతిలోకి వెళ్ళిపోతుందని, ప్రజలసొమ్ముతో నిర్మించిన విద్యుత్‌సంస్థల నెట్‌వర్క్‌ద్వారా ప్రవేటు కంపెనీలు విద్యుత్‌సరఫరాచేసి విద్యుత్‌అందించి కార్పోరేషన్ దారులు కోట్లు గడిస్తారని, ఈకుట్రను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే బిగించిన అన్నిక్యాటగిరిల స్మార్ట్‌మీటర్లను వెంటనే తమ సిబ్బంది ద్వారా తొలగించాలని, ప్రజలు, వినియోగదారులు నుండి అనుమతి పత్రం లేకుండా బాగున్న మీటర్లను తీసివేసి స్మార్ట్ మీటర్లను పెట్టవద్దని, ప్రజలను, వినియోగదారులను బెదిరించి మోసపు మాటలు చెప్పి అనుమతిలేకుండా స్మార్ట్‌మీటర్లను బిగించాలని ప్రయ త్నిస్తే ప్రజలు, వినియోగదారులు పౌరసంఘాలతో కలిసి ప్రతిఘటిస్తామని డేవిడ్‌రా సిపిఎం పట్టణ కమిటీ తరపున హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు షేక్ సంధాని, నాగయ్య సిఐటియు నాయకులు జి.వి.శివప్రసాద్, కొండమూరు హజరత్తయ్య, పలువురు నాయకులు, కార్యకర్తలు, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేయాలి

### లీడ్ బ్యాంకు మేనేజర్

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి క్లస్టర్ ప్రజలను వివిధ బ్యాంకులు రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని లీడ్ బ్యాంకు మేనేజర్ మణి శేఖర్ పేర్కొన్నారు. ఆయన బుధవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో బ్యాంకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకర్లు వారి కేటాయించిన లక్ష్యాలను నిర్దేశించిన గడువులోపు నూరు శాతం సాధించాలన్నారు. డైరీ ఫామ్‌ను ప్రోత్సహించేందుకు ఎక్కువ సంఖ్యలో రుణాలు ఇవ్వాలన్నారు. రికవరీ శాతాన్ని కూడా పెంచాలన్నారు. జన సురక్ష పథకంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఖాతాదారుల ఖాతాలకు ఎన్‌పీసీఐ అను సంధానం చేయాలన్నారు. లింక్ అయితే ప్రభుత్వ పథకాల నగదు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతుందన్నారు. బ్యాంకర్లు ఇతర శాఖల అధికారులు తన దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్క రిస్తానన్నారు. బ్యాంకర్లు ఖాతాదారుల నుండి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. డిఆర్‌డిఏ శాఖ సిబ్బంది స్త్రీనిధి రుణాల రికవరీ పైనే కాకుండా బ్యాంకు నుంచి రుణాల వసూళ్లపై కూడా దృష్టి సాధించాలన్నారు. ఖాతాదారులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకొని ఆర్థిక పరిపుష్టి సాధించేలా సంబంధిత శాఖ అధికారులు చూడాలన్నారు. ఈ సమావేశంలో అధికారులు కాశయ్య, రవిశంకర్ జయదేవ్, ఎంపీడీవోలు అప్పాజీ, గోపి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించకపోతే.. ఆందోళన చేస్తాం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ప్రజా రవాణా సంస్థ ఉద్యోగులు ఎదుర్కొం టున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే రాష్ట్ర కమిటీ మేరకు దశలవారీగా తమ ఆందోళన ఉధృతం చేస్తామని ఏపీసిటిడి నేషనల్ మజ్దూర్ యూనియట్ మాజీ డిపో కార్యదర్శి ఎస్‌డి మౌలాలి పేర్కొన్నారు. బుధవారం డిపో ఎదుట సంఘ ఉద్యోగులు చేపట్టిన రెండవ రోజు ధర్నా లో పాల్గొని మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఏలను వెంటనే చెల్లించాలన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు ముందు చేయాలన్నారు. ఎలక్ట్రికల్ బస్సులను స్వయంగా ప్రభుత్వం ద్వారా లేదా సంస్థ ద్వారా కొనుగోలు చేయాల న్నారు. గ్యారేజ్ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరిం చాలన్నారు. ఈ ధర్నాకు ఏపీ ఎన్జీవో నాయకులు షేక్ రియాజ్ సంఘీ భావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సలాం, కాశీ విశ్వనాథ్, మూర్తి, సీనారెడ్డి, ఫణికుమార్, విజయకుమార్, ముజాఫర్, జయశంకర్, గోపి తదితరులు పాల్గొన్నారు

## పాతాళపల్లిలో రైతులకు శిక్షణ

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** మండలంలోని పాతాళపల్లి గ్రామంలో ఆత్మ సౌజన్యంతో మండల వ్యవసాయ అధికారి ఈ శైలజా కుమారి ఆధ్వర్యంలో బుధవారం రైతు సేవా కేంద్రంలో రైతులకు శిక్షణ నిర్వహిం చారు. ఈ సందర్భంగా వరి సాగులో సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర నీటి యాజమాన్యం, సమగ్ర తెగుళ్ల నీటి యాజమాన్యం, సమగ్ర పురుగుల యాజమాన్యం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బిజీవేముల ఓబుల్‌రెడ్డి, మండల వ్యవ సాయ విస్తరణ అధికారిని కే.కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, వ్యవసాయ గ్రామ సహాయకులు వెంకటసుబ్బయ్య, జోత్స్న, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో బాల నేరస్తుడు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని ఏఎంసీ కార్యాలయంలో చోరీకి పాల్పడిన ఓ బాల నేరస్తుని అదుపులోకి తీసుకొని సొత్తు రికవరీ చేసినట్లు ఎస్ఐ కర్నాట ఇంద్రసేనారెడ్డి బుధవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 10వ తేదీ రాత్రి సమయంలో ఏఎంసీ కార్యాలయ కిటికీలు ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించి కంప్యూటర్లు ఇతర సామాగ్రి చోరీ గురైనన్నారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా పట్టణంలోని షబీర్ కాలనీకి చెందిన ఓ బాల నేర స్తుడు చోరీ చేసినట్లు గుర్తించి అదుపులోకి తీసుకుని సామాగ్రిని రికవరీ చేశామన్నారు. ఈ మేరకు ఆ బాల నేరుతుని జువైనల్ కోర్టులో హాజరు పరిచినట్లు అని తెలిపారు.

## సొసైటీ చైర్మన్ డైరెక్టర్ల బాధ్యతల స్వీకరణ

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక కొటాలపల్లి ప్రాథమిక సహకార పర పతి సంఘం కార్యాలయంలో బుధవారం సొసైటీ చైర్మన్గా గడ్డం వెంకట సామయ్య డైరెక్టర్లుగా భద్ర నరసింహులు నల్లిపోగు రాజాలు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సొసైటీ పరిధిలోని రైతుల అభివృద్ధికి తమవంతు కృషి చేయడంతో పాటు ప్రభుత్వం ప్రవే శపెట్టే సంక్షేమ పథకాలు వారి దరిచేరలా చూస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో ప్రత్యేక అధికారి శ్రీనివాసులు రెడ్డి బ్యాంక్ మేనేజర్ రాజశేఖర్ సీఈవోలు పోలయ్య రత్తయ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ మాశిలామణికి చిరు సత్కారం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కె.మాశిలామణికి చిరు సత్కారం జరిగింది. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ జోనల్ ఆఫీసర్ శివప్రసాద్ ఎస్‌బీఐ లైఫ్ బిజినెస్ కర స్పాండెంట్ భాషలు మాజీ నగదు అధికారి వల్లూరుపల్లి కోటేశ్వరరావుతో కలిసి మాశిలామణి ని చిరు సత్కారం చేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలో పేరు పొందిన చిన్న పిల్లల వైద్యునిగా సుదీర్ఘకాలం ప్రభుత్వ వైద్యునిగా మారుమూల ప్రాంతాలలో సైతం తన వైద్య సేవలను అందిం చి ఎంతోమందికి ప్రాణం దీక్ష పెట్టిన ప్రాణదాతగా మాసిలమని నిలిచా రన్నారు. అలాగే ఎస్‌బీఐ ఖాతాదారునిగా వివిధ లైఫ్ ఇన్సూరెన్స్ సేవింగ్స్ చేసిన వైద్యునికి తమ శాఖ తరపున చిన్నపాటి సత్కారం చేసుకోవడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది ఉన్నారు.